క్లుప్తంగా

అందుబాటులోకి డిజిటల్ ఎక్స్‌రే పరికరం

కలెక్టర్‌కు బీసీ సంక్షేమ సంఘం నేతల కృతజ్ఞతలు



కలెక్టర్ రంజిత్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీసీ సంఘ నాయకులు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా ప్రభుత్వాస్పత్రిలో డిజిటల్ ఎక్స్‌రే పరికరాన్ని అందుబాటులోకి తీసుకురావడంపై బీసీ సంక్షేమ సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. కలెక్టర్ పి. రంజిత్‌బాషాను బుధవారం ఆయన చాంబర్‌లో నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రూ. 50 లక్షలు విలువైన డిజిటల్ ఎక్స్‌రే పరికరం కొంత కాలంగా నిరుపయోగంగా ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టర్, బందరు ఎమ్మెల్యే పేర్ని నాని స్పందించి వెంటనే ఆ పరికరాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తోట బాబు, జోగి శివ, జన్ను గోవింద్, చేబోయిన కోటేశ్వరరావు, పుట్టి రాజశేఖర్ పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. రాజమండ్రికి చెందిన గౌతమి నేత్రాలయం వైద్యులు 15 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఇద్దరికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు ఆశీర్వాదం, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు సయ్యద్‌పీర్ పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో మల్లవోలు విద్యార్థుల ప్రతిభ



గూడూరు: తూర్పు గోదావరి జిల్లా అమలాపురానికి చెందిన కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత చిత్రకళా పోటీల్లో గూడూరు మండలం మల్లవోలు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. గ్రూపు విభాగంలో ప్రకృతి పరిరక్షణ, సంస్కృతి సంప్రదాయాలు అంశాలలో పాఠశాల విద్యార్థులు పి.యోషిత, ఎం.భవ్యశ్రీ, ఎం.ప్రసన్న, కె.దేవి చాందిని, డి.జీవిత, వి.కౌషిక్, ఎస్.వి.ఎస్.ఎన్.కార్తికేయ బంగారు పతకం సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పాండురంగారావు తెలిపారు. అఖిల భారత స్థాయిలో బంగారు పతకం సాధించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు బి.ఎస్.వి.రమేష్‌ను అభినందించారు.

ఆర్థిక సాయం అందజేత

కోడూరు: కోడూరు వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యుడు ఊటగుండం గ్రామానికి చెందిన కందుల నాగేశ్వరరావు ఇటీవల మృతిచెందాడు. సంఘం ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేల నగదును అందించామని సంఘ సీఈఓ అర్జా వెంకట నగరాయులు తెలిపారు. సంఘ చైర్‌పర్సన్ పరిశె మాధవరావు, సభ్యుడు పేరె బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమేరాల ఏర్పాటు

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాలపాలెం ప్రధాన సెంటర్‌లో రూ.24 వేలతో దాతలు సమకూర్చిన సీసీ కెమేరాలను మూడు చోట్ల ఏర్పాటు చేశామని ఎస్‌ఐ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అన్ని చోట్లా సీసీ కెమేరాల ఏర్పాటుకు దాతలు సహకారం అందించాలని కోరారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు వరం



కొత్తమాజేరు (చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదలకు వరమని మండల వైద్యాధికారి డాక్టర్ కె.విజయరావు అన్నారు. బుధవారం కొత్తమాజేరు జగనన్న విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలతో పాటు, సాధారణ ఆరోగ్య సమస్యలతో బాధ పడే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికి పరిమితమైన వారికి ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షలు చేసి మందులు అందజేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

డీఈఓ తాహెరాసుల్తానా

మచిలీపట్నంటౌన్: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని డీఈఓ తాహెరా సుల్తానా అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సంస్కృతి, సాంప్రదాయాలను అలవరుచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రుస్తుంబాద మునిసిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన రంగవల్లులను పరిశీలించి ఆమె మాట్లాడారు. విజేతలకు బహుమతులను అందజేశారు. డీఎస్‌ఓ వి. పార్వతి, డీవైఈఓ సుబ్బారావు, కమిషనర్ చంద్రయ్య, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, ఎంహెచ్ఓ వై. సుబ్రహ్మణ్యం, వెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు నంగేగడ్డ బాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్వీ పబ్లిక్ స్కూల్‌లో...

స్థానిక హిందూ కళాశాల ఆవరణలోని వేంకటేశ్వర హైస్కూల్ ఆవరణలో సంక్రాంతి వేడుకలు జరిగాయి. భోగిమంటలు, పొంగళ్లు, సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, బొమ్మలకొలువులతో విద్యార్థులు ఆనందంగా గడిపారు. సంప్రదాయ దుస్తులు, హరిదాసు వేషధారణలో అలరించారు. హిందూ విద్యాసంస్థల కార్యదర్శి దైతా గోపాలకృష్ణ శాస్త్రి, ప్రిన్సిపాల్ ఎ. విజయమాధవి పాల్గొన్నారు.

● పెడన: సెయింట్ విన్సెంట్ పల్లోటి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు, హరిదాసు వేషధారణలో అలరించారు. కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ రాజీవ్, పట్టణానికి చెందిన సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, రౌతుల ప్రసాద్, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహాయ ఫౌండేషన్ వారు రూ. 50వేల నగదును ఫాదర్ జోజిరెడ్డికి అందజేసి సేవా కార్యక్రమాలకు ఉపయోగించాలని కోరారు.

● కోడూరు: స్థానిక జీవి అకాడమీ, కోట రాఘవయ్య విద్యాసంస్థల్లో విద్యార్థినులకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. పాఠశాలల ఆవరణలో బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. విద్యార్థులు హరిదాసు, శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో అలంకరించారు. చిన్నారులపై ఉపాధ్యాయులు భోగిపండ్లు పోసి ఆశీర్వచనాలు అందించారు. విద్యార్థినులు పట్టుపరికిణులు ధరించి సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. సరదాగా కోడిపందెలు వేసి విద్యార్థులను ఉత్సాహపరిచారు. కోడూరు మెయిన్ ప్రాథమికోన్నత పాఠశాలలో సంకాంత్రి వేడుకలు జరిగాయి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● నాగాయలంక: స్థానిక విద్యాభారతి పబ్లిక్ పాఠశాలలో చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వచనాలు అందజేశారు. విద్యార్థులు కోడిపుంజులతో సరదా పందేలు వేసి సందడి చేసారు. అలాగే గాలిపటాలను వెగురవేసి కేరింతలు కొట్టారు. ఎడ్ల బండ్లుతోసి సరదాగా గడిపారు. జానపదనృత్యాలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు పోటీపడి రంగవల్లులు వేశారు. పాఠశాల కరస్పాండెంట్ ఆకుల వెంకటరత్నారావు, పాఠశాల కమిటీ అకడమిక్ డైరెక్టర్ ఏవీ శేషుబాబు, బిల్డర్ తలశిల శివాజీ, విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

● బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను సర్పంచ్ వి. కృష్ణవేణి ప్రారంభించి సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం విద్యార్థినులు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టరు కె. కిషోర్ గంగిరెడ్డుల మేళగాళ్లను సత్కరించారు. అనంతరం సర్పంచ్ కృష్ణవేణి దంపతులను డైరెక్టర్ కిషోర్ దంపతులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుజ్ఞానం మహేష్ బ్రదర్స్, బి. గాంధీ, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● అవనిగడ్డ: స్థానిక విద్యా నికేతన్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ పి. లంకమ్మప్రసాద్ సంక్రాంతి పూజలు చేశారు. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బందరు ఎస్వీ పబ్లిక్‌స్కూల్‌లో సంక్రాంతి వేడుకలు



కోడూరులో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న దృశ్యం



రుస్తుంబాదలో విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న డీఈఓ తాహెరా సుల్తానా



నాగాయలంక విద్యాభారతి పాఠశాలలో కోడి పందెం వేస్తున్న బాలికలు



బంటుమిల్లి కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న చిన్నారులు



పెడన పల్లోటి స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



అవనిగడ్డ విద్యా నికేతన్‌లో చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తున్న లంకమ్మ ప్రసాద్

మృతుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): మృతుల కుటుంబ సభ్యులను అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం పరామర్శించారు. పెదప్రోలు పంచాయతీ చైతన్య నగర్‌కు చెందిన వృద్ధ దంపతులు కొక్కిలిగడ్డ రామయ్య, శాంతమ్మలు ఒకే రోజున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, గ్రామ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రావుకు సన్మానం



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేమూరి వెంకట్రావును పలువురు ముస్లింలు బుధవారం సన్మానించారు. మసీద్ ఏ నూరాని అహ్మదీయ జమాత్ జిల్లా అధ్యక్షుడు షేక్ యాసిన్ సాహెబ్, ఘంటసాల మసీద్ ప్రెసిడెంట్ షేక్ జాకీర్ హుస్సేన్‌లు వెంకట్రావ్‌ను సత్కరించారు. ముస్లిం నేతలు అక్బర్ అనీఫ్, షరీఫ్ బాషా, రసూల్ అల్లావుద్దీన్‌తో పాటు పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఉచితంగా 63 రకాల వైద్య పరీక్షలు

డీఎంహెచ్ఓ గీతాబాయి



ఘంటసాల పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ గీతాబాయి

ఘంటసాల(అవనిగడ్డ): జిల్లాల్లోని అన్ని పీహెచ్‌సీల్లో 63 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని డీఎంహెచ్ఓ డాక్టర్ జి. గీతాబాయి తెలిపారు. ఘంటసాల పీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. వైద్యశాలలో అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ గదులు ఇరుకుగా ఉన్నాయని, ప్రతిపాదనలు పంపితే అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. పీహెచ్‌సీలో అందుతున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీలో చేస్తున్న 63 రకాల వైద్య పరీక్షలను రోగులు ఉపయోగించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వైద్య సిబ్బంది రోగులకు సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. పీహెచ్‌సీ వైద్యులు ప్రమోద్ కుమార్, వెంకటేశ్వరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కూడార్సై ఉత్సవం



కోడూరులో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



అవనిగడ్డలో గంగాదేవికి పొంగలి నివేదన

కోడూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని కోడూరు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి, ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయాల్లో బుధవారం కూడార్సై ఉత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన 108 పాత్రలలో నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. 108 గంగాళాల నైవేద్యానికి ముందుగా పూజలు చేశారు. అనంతరం సామూహిక కుంకుకుమార్చన, నక్షత్ర హారతిని కనులపండువగా నిర్వహించారు. ఉల్లిపాలెంలో అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో ఉత్సవాలు జరిగాయి. కోడూరులో ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా, ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● చల్లపల్లి: స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలోని గీతా మందిరంలో శ్రీకృష్ణుడు, గోదా, రంగనాథుల విగ్రహాలకు విశేష అలంకరణ చేసి వైఖానస ఆగమ శాస్త్ర రీతిలో ధనుర్మాస పూజలు చేశారు. 108 గిన్నెల్లో పొంగలి నివేదించారు. సంఘ అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు, తమ్మన సతీష్ కుమార్, సురేంద్ర, నాగమణి, నళిని, కుసుమ ప్రమీల, నాగ కుమారి పర్యవేక్షించారు.

● మచిలీపట్నంటౌన్: నగరంలోని యతిరాజ భవన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో సువాసినీలు పాల్గొని పూజలు చేశారు. స్వామి వారికి భక్తులు ప్రసాదాలను నైవేద్యంగా ఉంచారు.

● అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలో అర్చకులు దీవి నరసింహమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి అర్చనలు చేశారు. 108 గంగాళాలతో పాయసం ప్రసాదాన్ని గంగాదేవికి సమర్పించారు. గీతామందిర కమిటీ చైర్మన్ వై. శ్రీహరిబాబు, భోగాధి రాము పర్యవేక్షించారు.

లైంగిక దాడికి యత్నించిన నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

కోడూరు: రహదారిపై ఒంటరిగా వెళ్తున్న మహిళపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిని కోడూరు పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను తెలిపారు. మండలంలోని మందపాకల గ్రామానికి చెందిన మహిళ (32) కోడూరులోని వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఆమె ప్రతి రోజు ఉదయం ద్విచక్ర వాహనంపై దుకాణానికి వెళ్లి పని ముగియగానే తిరిగి రాత్రికి ఇంటికి చేరుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో ఆమె దుకాణంలో పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఇస్మాయిల్ బేగ్ పేట గ్రామం దాటిన తరువాత కటారి బొందల వద్ద ఐబీపేట గ్రామానికి చెందిన జరుగు అశ్వినీకుమార్ సదరు మహిళను వెంబడించాడు. బైక్ పైనుంచి మహిళను కిందకు లాగి పక్కనే ఉన్న పొదల్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. మహిళ ప్రతిఘటించి కేకలు వేయడంతో రహదారి వెంట వెళ్లేవారు ఘటనాస్థలానికి రావడంతో నిందితుడు పరారయ్యాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి పోలీసులు మూడు బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలించారు. నిందితుడు అశ్వినీకుమార్‌ను మంగళవారం సాయంత్రం ఐబీపేటలోని ఇంటి వద్ద అరెస్ట్ చేశారు.

29న మెగా వైద్య శిబిరం

చల్లపల్లి: లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశామని క్లబ్ కార్యదర్శి నర్రా సాయిబాబు తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక విజయా హైస్కూల్‌లో శిబిరం ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. విజయవాడ పళ్లెం పెద్దేశ్వరరావు ఆస్పత్రి వారి సహకారంతో విజయా హైస్కూల్‌లో నెఫ్రాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, సాధారణ, ఆప్తమాలజీ సంబంధిత వైద్య సేవలు అందిస్తారని చెప్పారు.

డాక్టర్ పళ్లెం పెద్దేశ్వరరావుతో పాటు పది మంది వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొంటారని చెప్పారు. శిబిరాన్ని చల్లపల్లి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేధింపుల భర్తపై కేసు

కోనేరుసెంటర్: వేధింపుల భర్తపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. మచిలీపట్నం మాచవరానికి చెందిన బెజవాడ లక్ష్మణరావు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసైన లక్ష్మణరావు తరచూ భార్య సుబ్బులక్ష్మితో ఘర్షణ పడుతుంటాడు. పుట్టింటి నుంచి అధిక కట్నం తీసుకురమ్మంటూ వేధిస్తున్నాడు. భర్తకు అత్త తోడవటంతో లక్ష్మణరావు ఆగడాలు అధికమయ్యాయి. మంగళవారం రాత్రి పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చిన లక్ష్మణరావు డబ్బుల కోసం కొట్టటంతో పాటు అనుమానంతో మానసికంగా వేధించాడు. వేధింపులు తాళలేక సుబ్బులక్ష్మి చిలకలపూడి పోలీసులను ఆశ్రయించి న్యాయం కోరింది. వేధింపులకు పాల్పడుతున్న భర్తతో పాటు అందుకు సహకరిస్తున్న అత్తపై ఫిర్యాదు చేసింది.

పశు సంరక్షణే పోటీల ధ్యేయం

గుడివాడటౌన్: ఒంగోలు జాతి పశువుల సంరక్షణే ధ్యేయంగా గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. గుడివాడ కే కన్వెన్షన్ నగర్‌లో 'ఎన్టీఆర్ 2 వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్లు బండలాగుడు జాతీయ స్థాయి పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఒంగోలు జాతి ఎడ్లను పోషించి, భావితరాలకు వాటి ప్రాముఖ్యతను తెలిపేందుకు కొడాలి నాని కృషిచేస్తున్నారని కొనియాడారు. ఈ పోటీల ద్వారా పశుపోషకులతో పాటు ఒంగోలు జాతి సంపదకు మేలు జరుగుతుందన్నారు. ఏటా సంక్రాంతిని పురస్కరించుకుని ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారని, రైతులు సైతం ఆసక్తిగా వీటిలో పాల్గొని మద్దతుగా నిలవడం అభినందనీయమని అన్నారు. నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, మాజీ కౌన్సిలర్‌లు మాదాసు వెంకటలక్ష్మి, వీరిశెట్టి నరసింహారావు, చింతల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గో పూజ

పామర్రు: గ్రామంలోని విష్ణాలయంలో గోమాతకు విశేషంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత గోమాతకు ప్రత్యేకంగా పసుపు, కుంకుమ, గంధం తదితరాలతో పూజలు చేసి తర్వాత గోవుకు ఇష్టమైన పదార్థాలను నివేదనగా సమర్పించారు.

సర్పంచ్ సొంత నిధులతో రోడ్డు నిర్మాణం



సర్పంచ్ సొంత నిధులతో నిర్మించిన రోడ్డు

అశ్వరావుపాలెం(అవనిగడ్డ): మండల పరిధిలోని అశ్వరావుపాలెంలో సర్పంచ్ పాంద్రాజు లంకమ్మ ప్రసాద్ రూ. రెండు లక్షల సొంత నిధులతో ఎంపీయూపీ స్కూల్ రోడ్డు వేయించారు. గ్రామంలోని యూపీ స్కూల్‌కు వెళ్లే రహదారి బాగా దెబ్బతినడంతో విద్యార్థులు, ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో తక్కెళ్ల పోతురాజు ఇంటి నుంచి కూనపరెడ్డి నాగముసీశ్వరరావు ఇంటి వరకు పలు దఫాలుగా రహదారిని అభివృద్ధి చేశారు. బుధవారంతో ఈ రహదారి పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ లంకమ్మ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు సొంత నిధులతో ఈ రహదారి వేయించానని వివరించారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా

పేర్ని కిట్టు



మహిళను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలు ఆర్థికంగా బలపడుతున్నాయని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం పదో డివిజన్‌లో నిర్వహించారు. కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగంతో కలిసి గడపగడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధితో ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పరింకాయల విజయ్, తిరుమలశెట్టి ప్రసాద్, పల్లి శేఖర్, వాణిశ్రీ, కో-ఆప్షన్ సభ్యురాలు తులశమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ బాషా, షేక్ మొహమ్మద్‌సాహెబ్, మరీదు నాగరాజు, మన్నే శేషారావు పాల్గొన్నారు.

లేఅవుట్ మెరక పనులకు సహకరించండి

బందరు తహసీల్దార్ సునీల్‌బాబు



తపసిపూడి గ్రామంలోని బే ఆఫ్ బెంగాల్ ల్యాండ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ సునీల్‌బాబు

కోనేరుసెంటర్: బందరు మండలం కరగ్రహారం లేఅవుట్ అభివృద్ధి పనులకు గ్రామస్తులు సహకరించాలని బందరు తహసీల్దార్ డి. సునీల్‌బాబు అన్నారు. బుధవారం ఆయన తపసిపూడి గ్రామంలోని బే ఆఫ్ బెంగాల్ ల్యాండ్ నుంచి జరుగుతున్న మట్టి తరలింపు పనులను పరిశీలించి మాట్లాడారు. మట్టిని లేఅవుట్ మెరక పనుల కోసం తరలిస్తుండగా విషయం తెలియని జనసేన నాయకులు జెండాలతో వచ్చి మట్టి తరలింపు పనులను ఆపాలని చూడటం సరికాదన్నారు.

ఇక్కడి నుంచి మట్టిని తరలించడం వలన గ్రామస్తులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని చెప్పారు. విషయాన్ని అర్థం చేసుకుని వ్యవహరించాలని కోరారు. మట్టి తరలింపు పనులను తిరిగి ప్రారంభించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రామానికి సుదూరంగా ఉన్న దిబ్బల నుంచి మాత్రమే మట్టిని మెరక పనుల కోసం తరలిస్తామని చెప్పిన ఆయన పోర్టు అభివృద్ధి పనులు కోసం డ్రెడ్జింగ్ చేసే సమయంలో వచ్చే మట్టిని తిరిగి బే ఆఫ్ బెంగాల్ ప్రాంతంలోని గుంతలను పూడ్చేలా గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.

మట్టి తరలింపు విషయంలో గ్రామస్తులకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించి తమ అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. నిరుపేదల కోసం తలపెట్టిన అభివృద్ధి పనులకు అడ్డుపడకుండా పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆర్‌పేట సీఐ కొండయ్య, ఎస్‌ఐ వాసు, రూరల్ ఎస్‌ఐ చాణక్య, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బంటుమిల్లిలో శాకాహార ర్యాలీ



బంటుమిల్లిలో శాకాహార ర్యాలీ

బంటుమిల్లి: ప్రపంచంలో వస్తున్న వాతావరణ మార్పులు, ఉత్పాతాలకు మానవ తప్పిదాలే కారణమని పిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్ ట్రైనర్ శివ ప్రసాద్ అన్నారు. స్థానిక కనకదుర్గ పిరమిడ్ ధ్యాన్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న మౌన ధ్యాన మహా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం గ్రామంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు.

శివప్రసాద్ మాట్లాడుతూ శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ధ్యానం, శాకాహారం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడమే జీవకారుణ్య పిరమిడ్ ధ్యాన కేంద్రం ఉద్దేశ్యమన్నారు. అనంతరం పిరమిడ్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో ట్రైనర్లు మాట్లాడారు.